క్లుప్తంగా

శోభాయమానంగా స్నపన తిరుమంజనం



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికి కార్తిక మాసం పురస్కరించుకొని శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్నపన తిరుమంజనం శోభాయమానంగా మంగళవారం జరిగింది. శ్రీవారికి వావిలాల స్మృతివనం వద్ద గల తారకరామసాగర్‌లోని కృష్ణానది జలాల దగ్గర కార్తీకమాస పూజలు నిర్వహించి నక్షత్ర, పంచ హారతులను అర్చకులు కనులవిందుగా నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు చంద్రప్రభ వాహనంపై వెన్నముద్ద కృష్ణుడి అలంకారంలో ఊరేగింపుగా పురవీధులలో దర్శనమిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికి కార్తిక పున్నమి నాడు హరిహరులను దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. అనంతరం దీపోత్సవ సేవ, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

పెదకూరపాడు: ఓటరు నమోదు, చేర్పులు, మార్పులకు సంబంధించి రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి నాగజ్యోతి కోరారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యంతరాలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్లు జియావుర్ హక్, విజయశ్రీ, క్షమారాణి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల నిర్వహణ బాధ్యతలపై శిక్షణ

క్రోసూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యతలపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో బి.మహేష్, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య పాల్గొన్నారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ పంచాయతీ సమావేశాలు ఏ విధంగా పెట్టాలి, ఏ విధంగా తీర్మానాలు చేయాలి, కార్యదర్శికి ఉన్న బాధ్యతలు, సర్పంచ్‌ల బాధ్యతలు తెలియజేశారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న సర్పంచ్‌లు తగిన విధంగా పరిపాలన సమాచారం తెలుసుకోవాలన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే అభివృద్ధి పనులు, వాటి బిల్లులు, ప్రతి నెలా జరిగే పంచాయతీ పనుల ఖర్చులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 18 గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బడివయస్సు పిల్లలను బడికి పంపాలి

క్రోసూరు: బడివయస్సు పిల్లలను కచ్చితంగా బడికి పంపాలి, ఎట్టి పరిస్థితుల్లోనూ బాల కార్మికులుగా మార్చవద్దు, వారిని పనుల్లో చేర్చుకుంటే ఆయా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్‌జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ నాగవెంకటలక్ష్మి సూచనల మేరకు సోమవారం రాత్రి క్రోసూరులో బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. పారాలీగల్ వలంటీర్ షేక్ ముబారక్, షేక్ సుభాని, షేక్ ఖాజావలి, శ్రీనివాసరెడ్డి, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

విద్య ద్వారానే గౌరవం

సత్తెనపల్లి: విద్య ద్వారానే సమాజంలో గౌరవం లభిస్తుందని రామకృష్ణపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం ఆమోదించిన నవంబర్ 26 సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు డీబీఆర్సీ సర్టిఫికెట్స్‌ను మంగళవారం ప్రదానం చేశారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకొని పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఉపాధ్యాయినులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

- వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి
- అట్టహాసంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

సత్తెనపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ రావాలని వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కరరెడ్డి అన్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఓ వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరోవైపు అభివృద్ధి పరుగులు పెట్టిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయటమే కాక ఇవ్వని హామీలను కూడా జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ముందుగా నాలుగున్నర ఏళ్లలో రూ.22,07,56,476తో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం అక్కడే బస చేసేందుకు ఉపక్రమించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, సర్పంచ్ చెరుకూరి వన్నూరు, పార్టీ నాయకులు గొడుగుల సుబ్బారావు, రవిచంద్రన్, లోక్‌నాద్, షణ్ముఖదాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులున్నారు.

హసనాబాద్‌లో వై ఏపీ నీడ్స్ జగన్..

హసనాబాద్(క్రోసూరు): మండలంలోని హసనాబాద్‌లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వెలది అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోటయ్య మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాలకు అండగా నిలిచింది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం వివరాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. పల్లెనిద్ర చేపట్టారు. కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్‌రహీం, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ వీరయ్య, మాజీ సర్పంచ్ రహిమాన్, ముస్తఫా పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్..

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మక్కెన అచ్చయ్య పాల్గొని రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎందుకు అవసరమో వివరించారు. ముందుగా గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో బస చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సురేఖ, ఎంపీటీసీ విజయలక్ష్మీ, మాజీ వైస్ ఎంపీపీ రామలింగారెడ్డి, మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు, రామకృష్ణ, సాంబశివరావు, సుబ్బారావు, నాగరాజు, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, కన్వీనర్లు రాజేష్, శంకర్, చంద్రశేఖర్, మైనార్టీ సెల్ నాయకులు హుస్సేన్ పాల్గొన్నారు.



కంకణాలపల్లిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఇరుకుపాలెం గ్రామ సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బడుగు, బలహీన వర్గాల మేలుకు జగనన్నే రావాలి

రాజుపాలెం: రాష్ట్రంలో పేదలకు మేలు జరగాలన్నా బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నా, రాష్ట్రానికి మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పక్కాల సూరిబాబు గ్రామస్తులను కోరారు. మండలంలోని బలిజేపల్లి మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగనన్న కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు అనంతరం సమావేశంలో లాయర్ సూరిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసరావు, ఎంపీపీ రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ సునీతాశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ వీరలక్ష్మీవేణు, గురవయ్య, ఏబీ మాజీ సొసైటీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, వీరయ్య, మాజీ సర్పంచ్ ప్రసాద్ దత్తు, వైస్ సర్పంచ్ వీరారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

కర్లపూడిలో పల్లెకుపోదాం

అమరావతి: ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం కర్లపూడి సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు, ప్రారంభించి సచివాలయంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ కర్లపూడి సచివాలయం పరిధిలోని గ్రామాలలో రూ.36.36 కోట్లు సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఖర్చు చేశారన్నారు. సర్పంచ్ మంచికలపూడి పద్మజా, ఎంపీడీవో ఉమాదేవి, ఈవోపీఆర్డీ గంగాధర్, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమాంబీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

బెల్లంకొండ: నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం బెల్లంకొండ గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామ దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు అహ్మద్‌పాషా, మరియదాసు, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, ప్రసాదరెడ్డి, సాయిరెడ్డి, దరియా, షరీఫ్, జాన్‌పీరా, మౌలాలి, బడాబచ్చా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సమన్యాయానికి జగనే రావాలి

సత్తెనపల్లి: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి అన్నారు. పట్టణంలోని 23,24 వార్డులకు సంబంధించి 9వ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలు ముంగిటికే తీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ముందుగా 9వ సచివాలయం పరిధిలోని 23, 24 వార్డులకు సంబంధించి రూ.18,74,36,142 జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అక్కడే బస చేసేందుకు ఉపక్రమించారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వార్డుల కౌన్సిలర్లు ఆకుల రమేష్, అచ్యుత శివప్రసాద్, జేసీఎస్ ఇన్‌చార్జ్ స్వాతి, పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకట్రావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, తిరుమలరావు, ప్రసాద్‌బాబు, నాగుల్‌బాషా, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



9వ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న డా.గీతా హాసంతి తదితరులు



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమంలో పేద మహిళకు తోపుడు బండిని అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు -సత్తెనపల్లి

మహాత్మాజ్యోతిరావ్‌పూలే భావితరాలకు స్ఫూర్తి

నకరికల్లు: బాలికా విద్యకు, బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి పోరాటం చేసిన మహాత్మా జ్యోతీరావ్ పూలే భావితరాలకు ఆదర్శనీయుడని భారత్ బచావో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు వి.కోటానాయక్ అన్నారు. స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సెంటర్‌లో భారత్ బచావో, పీడీఎం, మాల మహానాడు, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్, పలు పార్టీల ఆధ్వర్యంలో జ్యోతిరావ్‌పూలే వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎం రాష్ట్ర నాయకుడు వైవీ మాట్లాడుతూ సమాజంలో కులమతాల అసమానతలు అరికట్టేందుకు పూలే చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొర్రా లక్ష్మీబాయి, కాంగ్రెస్ ఎస్సీసెల్ కార్యదర్శి బొక్కా చిన్నగురు, షేక్ మస్తాన్‌వలి, గోదా బాల, నానికే నాయక్, షేక్ సైదా, లాలు, మడకా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బడుగుబలహీన వర్గాల అభ్యున్నతే జ్యోతిరావుపూలే లక్ష్యం

అమరావతి: అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పోరాటం చేసిన బడుగు వర్గాల పోరాటయోధుడిగా నిలిచిన జ్యోతిరావుపూలే నేటితరానికి ఆదర్శంగా నిలిచారని ఉమ్మడి గుంటూరు, పల్నాడు జిల్లాల బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బంధంరావురి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లేమల్లెలో నిర్వహించిన జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత నాయకులు జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మీరావలి, తోకల కిషోర్‌బాబు సాంబయ్య, ఎస్సీ నాయకులు మాణిక్యాలరావు ఎస్టీ నాయకుడు శ్రీనివాస్ నాయక్, గోవర్ధన్‌లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీలంతా క్రమక్రమంగా వైఎస్సార్‌సీపీలోకి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: సీఎం జగన్ పాలనలో సంక్షేమ, అభివృద్ధి పనులకు ఆకర్షితులవుతున్న బీసీ సోదరులంతా టీడీపీని వదలి క్రమక్రమంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. గత 10 రోజుల వ్యవధిలో చింతపల్లి, చిగురుపాడు, చామర్రు గ్రామాలలో బీసీ కుటుంబాలవారు టీడీపీ విడనాడి వైఎస్సార్ సీపీలో చేరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తాజాగా కొత్తపల్లి నుంచి 10 కుటుంబాలకు చెందిన బీసీ వడియరాజులు సోమవారం రాత్రి గుంటూరు వచ్చి పార్టీలో చేర్చుకోమని కోరినట్లు చెప్పారు. వారి కోరిక మేరకు పార్టీ కండువాలతో ఆహ్వానం పలికానన్నారు. వీరంతా గతంలో టీడీపీలో ఉండి ఏ విధమైన లబ్ధి పొందలేదని, అర్హత ఉండి కనీసం ఒక్క పెన్షన్ కూడా పొందలేకపోయారన్నారు. వైఎస్సార్ సీపీ వచ్చిన తరువాతనే తమకు అన్ని సంక్షేమ పథకాలు వర్తించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతా భావంగా వైఎస్సర్ సీపీలో చేరుతున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వంలో ఏ ఒక్కరికి అన్యాయం జరగదని, కులాలు, మాతాలు, పార్టీలు ఏవైనా అర్హతనుబట్టి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పు వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ, ఉప్పు శ్రీనివాసరావు, ఉప్పు విజయ, బండారు వెంకటరావు, బండారు భారతి తదితరులున్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాసరావు, సచివాలయాల కన్వీనర్ రామకృష్ణ తదితరులున్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన కొత్తపల్లి బీసీ సోదరులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పారదర్శకంగా తుది ఓటర్ జాబితా రూపకల్పన

సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి

సత్తెనపల్లి: పారదర్శకంగా తుది ఓటర్ జాబితా రూపకల్పన జరుగుతుందని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి అన్నారు. ఏపీ ఎన్నికల కమిషన్, పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2024లో భాగంగా అక్టోబర్ 27న ప్రచురించబడిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించారు. నియోజకవర్గ స్థాయిలో గతంలో ఫైనల్ పబ్లికేషన్ నుంచి ఇప్పటి వరకు చేర్చబడిన, తొలగించబడిన, సవరింపబడిన ఓటర్ల వివరాలను తెలియ జేశారు. జీరో డోర్ నెంబర్లు, 10 కన్నా ఎక్కువ మంది ఓటర్లు కలిగిన డోర్ నంబర్లు, 100 సంవత్సరాల వయసు పైబడిన ఓటర్ల వివరాల సవరణకు తీసుకున్న చర్యలను వివరించారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ఏఈఆర్వోలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజకుమారి

రాష్ట్రస్థాయిలో అచ్చంపేట విద్యార్థుల ప్రతిభ

అచ్చంపేట: స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రోసూరులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగాసనాలు, డాన్స్, స్పోర్ట్స్ పోటీలలో అచ్చంపేట జెడ్పీహెచ్ స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు పీడీ ఆలపాటి సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచిన విద్యార్థులను మంగళవారం హెచ్ఎం సీహెచ్ కళ్యాణి, ఉపాధ్యాయులు అభినందించారు. అండర్ 12 బాలికల విభాగంలో ఆర్.దీప్తి, డి.నిస్సి ప్రథమ, తృతీయ స్థానాలు సాధించినట్లు చెప్పారు. అండర్ 14 బాలుర విభాగంలో డి.అజయ్‌కుమార్, గణేష్‌వర్మ, బి.పోత్రాజులు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. అండర్ 17 బాలికల విభాగంలో కె.సింధుజ, షేక్ సూఫియాజ్, షేక్ శాయిజ వరుసుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, బాలుర విభాగంలో ఆర్.నవదీష్, కె.భానుప్రకాష్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా ఆర్.అజయ్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, డి.వికాస్ సమాన పాయింట్లతో తృతీయ స్థానాలు దక్కించుకున్నారన్నారు. డాన్స్ సోలో అండర్ 14 బాలికల విభాగంలో లూర్దుమేరి ప్రథమ స్థానం సాధించిందన్నారు. ఎస్.మౌనిక, జి.ప్రమీల గ్రూప్ ఫస్ట్, లూర్దుమేరి, అనూరాధ గ్రూపు సెకండ్ స్థానాలు దక్కించుకున్నట్లు చెప్పారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో జెడ్పీహెచ్ స్కూలు ఉపాధ్యాయులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

పెదకూరపాడు: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. నియోజకవర్గంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని బలుసుపాడు గ్రామానికి చెందిన చింతామేరి రూ.60వేలు, కాశిపాడు గ్రామానికి చెందిన హనుమాయ్య రూ.12 వేలు, అచ్చంపేటకు చెందిన మల్లికార్జునరావుకు రూ.35 వేలు, బెల్లంకొండ మండలం పాపాయపాలెంకు చెందిన రమాదేవికి రూ.1.30 లక్షల చెక్కులు అందజేశారు. అచ్చంపేట మండలం కస్తల గ్రామానికి చెందిన లక్ష్మిఅక్షయకు చెవిటి మిషన్ కోసం ముఖ్యమంత్రి సహాయనిధి లోన్ ఆఫ్ క్రెడిట్ కింద రూ.3 లక్షల చెక్కు అందజేశారు.

వైద్యశాలపై దాడికి నిరసనగా ర్యాలీ

సత్తెనపల్లి: పట్టణంలోని అనన్య వైద్యశాలలో పరికరాలు ధ్వంసం, డ్యూటీ డాక్టర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఐఎంఏ కార్యాలయం నుంచి నరసరావుపేట రోడ్‌లోని చెక్ పోస్ట్ మీదుగా తిరిగి గాంధీ బొమ్మల సెంటర్ మీదుగా డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని డీఎస్పీ బి.ఆదినారాయణకు వినతిపత్రం అందించారు. ఐఎంఏ బాధ్యులు మాట్లాడుతూ వైద్యశాలలోని విలువైన పరికరాలను ధ్వంసం చేయడమే కాక డ్యూటీ డాక్టర్‌పై దాడి చేయడం సరైంది కాదన్నారు. వైద్యులపై దాడులు నశించాలని, దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యులు చేపట్టిన ర్యాలీకి పట్టణంలోని రక్తపరీక్షల ల్యాబ్ నిర్వాహకులు మద్దతు తెలిపారు. ఐఎంఏ బాధ్యులు డాక్టర్ జెట్టి శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, డాక్టర్ చల్లా నాగరాజా రెడ్డి, డాక్టర్ పాలేటి నవీన్‌కుమార్, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్తా రామకృష్ణ, వివిధ రక్త పరీక్షల ల్యాబ్ నిర్వాహకులు ఉన్నారు